వేదిక ప్రాంగణం



డీఎంకే ఆధ్వర్యంలో నేడు 'ముప్పేరుం విళా'

● సిద్ధమైన నందనం మైదానం ● లక్షమంది కూర్చునేలా ఏర్పాటు

వేదిక ముఖద్వారం



పెరంబూర్, సెప్టెంబరు 16: డీఎంకే ఆధ్వర్యంలో స్థానిక నందనం వైఎంసీఏ మైదానంలో మంగళవారం 'ముప్పేరుం విళా' జరుగనుంది. ఈ కార్యక్రమంలో కోసం భారీ ఏర్పాట్లు చేశారు. ద్రావిడ మున్నేట్ర కళగం (డీఎంకే) 1949 సెప్టెంబరు 17న ఆవిర్భవించింది. 75 ఏళ్ల ప్రస్థానంలో డీఎంకే 25 ఏళ్లు అధికారపార్టీగా, మరో 35 ఏళ్లు ప్రతిపక్షపార్టీగా వ్యవహరించింది. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ తీసుకొనే కీలకమైన నిర్ణయాల్లో డీఎంకే ప్రధాన పాత్ర పోషించింది. అధికారపార్టీగాను, ప్రతిపక్షపార్టీగాను రాష్ట్రాభివృద్ధిలో కూడా డీఎంకే ప్రస్థానం సాగింది. అరింజర్ అన్నా, కలైంజర్ ఎం.కరుణానిధి తదితర మహానేతలు పార్టీని బలోపేతం చేశారు. వారి సిద్ధాంతాలు, ఆశయాల బాటలో ఆ పార్టీ 75 వసంతాలు పూర్తిచేసుకుంది. ప్రస్తుతం ఆ పార్టీ వజ్రోత్సవం, పెరియార్ జయంతి, అన్నా జయంతి మూడింటిని కలిపి 'ముప్పేరుం విళా'గా బ్రహ్మాండంగా నిర్వహించనున్నారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు నందనం వైఎంసీఏ మైదానంలో ఈ వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. చెన్నై దక్షిణం డీఎంకే కార్యదర్శి, మంత్రి ఎం.సుబ్రమణ్యం పర్యవేక్షణలో ఈ భారీ బహిరంగ సభ ఏర్పాట్లు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీకి విశేష సేవలందించిన వారిని సత్కరించనున్నారు. అలాగే ఈ ఏడాది ప్రకటించిన పురస్కారాల ప్రదానం కూడా జరుగనుంది. ఈ కార్యక్రమానికి మంత్రి సుబ్రమణ్యం ఆహ్వానం పలుకనుండగా, పార్టీ ప్రధాన కార్యదర్శి, మంత్రి దురైమురుగన్ అధ్యక్షత వహించనున్నారు. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి పాల్గొని పురస్కారాలు అందజేయనున్నారు. అలాగే, ఈ వేడుకల్లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొననున్నారు. సభా ప్రాంగణంలో లక్ష మంది కూర్చొనేలా భారీ పందిళ్లు ఏర్పాటుచేశారు. తేనాంపేటలోని అన్నా అరివాలయం, సభా ప్రాంగణాలను విద్యుద్దీపాలతో అలంకరించారు.

నేడు మిలాద్ ఉన్ నబీ

స్టాలిన్ సహా నేతల శుభాకాంక్షలు

చెన్నై, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం మిలాద్ ఉన్ నబీ వేడుకలు జరుపుకోనున్న ముస్లిం సోదరులకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి తదితర నేతలకు శుభాకాంక్షలు తెలిపారు. మహమ్మద్ ప్రవక్త జయంతిని వైభవంగా జరుపుకోనున్న ముస్లింలందరికీ స్టాలిన్ తన ప్రకటన లో హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మానవుల మధ్య తారతమ్యాలను తొలగించేందుకు, బానిసత్వ వ్యాపారం వంటి సామాజిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడిన మహా ప్రవక్త ఆయనేనని కొనియాడారు. ఆయన బోధనలు శాంతి, సమానత్వాలకు ప్రతీకలన్నారు. సత్యం పలుకటం, పవిత్రభావాలు కలిగి ఉండటం, నిరుపేదలకు సాయం చేయడం, అందరిపట్ల ప్రేమాభిమానాలను ప్రదర్శించటం మహ్మద్ ప్రవక్త మానవాళికి అందించిన బోధనలని ఈపీఎస్ తన ప్రకటనలో తెలిపారు. దేవదూత మహమ్మద్ ప్రవక్త మానవుల మధ్య మతసామరస్యాన్ని, సోదరభావాన్ని, సమానత్వాన్ని పెంపొందించడానికి జీవితపర్యంతమూ పాటుపడ్డారని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై కీర్తించారు. ఇదే విధంగా పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్, అధ్యక్షుడు అన్బుమణి రాందాస్ తదితర నేతలకు కూడా ముస్లిం సోదరులకు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలియజేశారు.

అక్టోబర్‌లో టీవీకే మహానాడు ?

● విజయ్ అభిమానుల్లో నిరాశ



చెన్నై, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు విజయ్ నాయకత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) తొలి మహానాడు అక్టోబర్ మూడో వారంలో నిర్వహించనున్నట్లు తెలిసింది. ఈ నెల 23న విక్రవాండిలో ఈ మహానాడును నిర్వహించేందుకు పోలీసుల అనుమతి లభించినప్పటికీ ఆ మహానాడు నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు చేపట్టలేదు. దీంతో మహానాడు తేదీని విజయ్ వాయిదా వేసినట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఫిబ్రవరిలో తమిళగ వెట్రి కళగం పేరుతో అట్టహాసంగా రాజకీయ పార్టీని ప్రారంభించి రాజకీయ ప్రవేశం చేసిన విజయ్ ఆగస్టు 22న పార్టీ పతాకాన్ని కూడా పరిచయం చేశారు. పార్టీ తొలి మహానాడులో పార్టీ సిద్ధాంతాలను వివరిస్తానని కూడా ప్రకటించారు. విజయ్ పార్టీని ప్రారంభించినప్పటి నుండి కడలూరుకు చెందిన ప్రముఖ జ్యోతిష్యుడు చంద్రశేఖర్ సూచనలు స్వీకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఆ జ్యోతిష్యుడి సూచన మేరకే ఆగస్టు 22న పార్టీ పతాకాన్ని విడుదల చేశారు. పార్టీ తొలి మహానాడును మదురై, తిరుచ్చి, కోయంబత్తూరు ఏదో ఒక నగరంలో అట్టహాసంగా నిర్వహించాలని ఆయన నిర్ణయించారు. చివరకు విల్లుపురం జిల్లా విక్రవాండి సమీపంలో ఉన్న వి. సాలై అనే ప్రాంతం వద్ద వందెకరాల ఖాళీ స్థలంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ ప్రకటించి పోలీసుల అనుమతి కోసం దరఖాస్తు చేసారు.. పోలీసులు అడిగిన ప్రశ్నలకు సమాధానలివ్వటం, చివరకు ఈ నెల 23న మహానాడు జరిపేందుకు పోలీసులు అనుమతివ్వటం కూడా చకచకా జరిగాయి. ఇక మహానాడు నిర్వహణకు భారీ ఏర్పాట్లు ప్రారంభమవుతాయని అందరూ అనుకున్నారు. పోలీసులు అనుమతిచ్చిన రోజున పార్టీ ప్రముఖులు మహానాడు స్థలాన్ని పరిశీలించారు. ఆ తర్వాత ఆ ప్రాంతంలో మహానాడు ఏర్పాట్లు ఏవీ జరుగలేదు. ఇదిలా ఉండగా విజయ్ నిర్దేశిత తేదీలోనే పార్టీ మహానాడును అట్టహాసంగా జరుపుతారని భావిస్తున్న ఆయన అభిమానులు, పార్టీ కార్యకర్తలు మహానాడుకు తరలిరండి అంటూ గోడలపై పెయింటింగ్‌లు, ప్రధాన కూడళ్ల వద్ద బ్యానర్లు, కటౌట్లు కట్టే పనులను ప్రారంభించారు. అన్ని చోట్లా పోస్టర్లు, గోడలపై, బ్యానర్లు, కటౌట్లపై మహానాడు జరిగే తేదీ మినహా తక్కిన వివరాలన్నీ ఉన్నాయి. విజయ్ తేదీని అధికారికంగా ప్రకటిస్తే పోస్టర్లు, బ్యానర్లపై వెనువెంటనే ఆ వివరాలను రాసేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉన్నారు. ఈ పరిస్థితులలో పార్టీ మహానాడును అక్టోబర్ మూడో వారానికి వాయిదా వేశారని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే విజయ్ నుంచి మాత్రం ఎలాంటి అధికారికా ప్రకటన రాకపోవడంతో ఆయన అభిమానులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు.

తూత్తుకుడి హార్బర్‌లో ఇంటర్నేషనల్ కంటైనర్ టెర్మినల్

● వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించిన ప్రధాని

చెన్నై, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి హార్బర్‌లో కొత్తగా నిర్మించిన ఇంటర్నేషనల్ కంటైనర్ టెర్మినల్‌ను సోమవారం ఢిల్లీ నుండి ప్రధాని నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త టెర్మినల్ ప్రారంభోత్సవం తూత్తుకుడి ఓడరేవు చరిత్రలో సరికొత్త మైలురాయి అని కొనియాడారు. ఈ టెర్మినల్ ప్రారంభంతో స్వదేశీ నౌకాయానం నడిపిన సమరయోధుడు వావు చిదంబరనార్ ఆశయాలు నెరవేరబోతున్నాయని తెలిపారు. ఇకపై తూత్తుకుడి ఓడరేవుతో విదేశీ నౌకా వాణిజ్య సంబంధాలు కూడా మెరుగవుతాయని కూడా పేర్కొన్నారు.



కొత్త టెర్మినల్ ప్రారంభించి ప్రసంగిస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ

'ఈశాన్య పవనాలు' వస్తున్నాయ్!

ప్రభుత్వం సిద్ధమేనా?



2015 లో సైదాపేట బ్రిడ్జి పైనుంచి ప్రవహిస్తున్న వరదనీరు (ఫైల్‌ఫొటో)

చెన్నై, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో కుండపోతగా వర్షాలు కురవనున్న నేపథ్యంలో దానికి తగిన విధంగా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందా అనే ప్రశ్న తలెత్తుతోంది. కుండపోత వర్షాలతో రాజధాని నగరం చెన్నైతో పాటు వివిధ జిల్లాలు నీట మునగడం ప్రతి ఏడాది పరిపాటిగా మారిపోయింది. మరి ఈ ఏడాది మళ్లీ వర్షాకాలం వచ్చేసింది.. దీనిని ఎదుర్కొనేందుకు రాష్ట్రం సిద్ధమేనా?.. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం యంత్రాంగం తీసుకున్న చర్యలేంటి?.. ఆ మేరకు కనీసం అడుగులైనా పడ్డాయా?..

నైరుతి-ఈశాన్య రుతుపవనాలు...

రుతుపవనాల కాలంలో మాత్రమే వర్షాలు సమృద్ధిగా కురుస్తుంటాయి. దేశానికి దిగువ భాగాన ఉన్న తమిళనాడుకు నైరుతి, ఈశాన్య రుతుపవన వర్షాలతో రాష్ట్రం నిండుకుండలా తయారవడం సహజమే. నైరుతి రుతుపవనాలు జూన్‌లో ప్రారంభమై సెప్టెంబరు వరకు వర్షాలు కురుస్తుంటాయి. గత ఏడాది (2023) రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల కారణంగా 35.40 సెం.మీ వర్షపాతం నమోదైంది. కానీ, ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో అక్టోబరు నుంచి డిసెంబరు వరకు మొత్తం 38 జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయి. గత ఏడాది ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో 45.78 సెం.మీ వర్షపాతం నమోదైంది.

పెనుముప్పులా వర్షం

రాష్ట్రంలో మరో రెండు వారాల్లో ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించనున్నాయి. కాగా, ఈ సమయంలో వర్షం కొద్దిరోజులు అధికంగా, మరి కొద్దిరోజులు ఆగి ఆగి కురుస్తాయి. కానీ, భూతాపం కారణంగా ఓజోన్ పొరకు రంధ్రం పడడంతో, రుతుపవనాల స్థితిగతులు మారి వాతావరణ పరిశోధకులు వర్షాలపై సరైన అంచనా వేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. హఠాత్తుగా కారు మబ్బులు కమ్ముకొని అతి భారీ వర్షాలు కురిసి భారీ వరదలు సంభవిస్తున్నాయి.

నగరం సురక్షితమేనా...?

చెన్నై కార్పొరేషన్ జలవనరుల శాఖ పరిధిలో కూవం, అడయార్, కొశస్థలి తదితర నదులు 162 కి.మీ చొప్పున, 15 కాలువలు 107.66 కి.మీ పొడవు కలిగి ఉన్నాయి. అలాగే, కార్పొరేషన్ పరిధిలో 33 కాలువలు 53.42 కి.మీ, 11,770 వర్షపు నీటికాలువలు 3,040 కి.మీ పొడవున్నాయి. రహదారులశాఖ పరిధిలో 42 వర్షపు నీటికాలువలు 237 కి.మీ ఉన్నాయి. వీటిలో కొన్ని ప్రాంతాల్లో వేల కోట్లతో పూడికతీత చేపడుతున్నారు. తాజాగా 5,000 కాలువల్లో పూడికతీతకు ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించింది. కానీ, రుతుపవనాల ప్రారంభానికి ముందే ఈ పనులు పూర్తవడం అనుమానంగానే కనిపిస్తోంది. గతంలో వర్షాలతో ఏర్పడిన విపత్తుల నుంచి నేర్చుకున్న గుణపాఠాలతో అలాంటి పరిస్థితులు మళ్లీ పునరావృతం కాకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రభుత్వ యంత్రాంగం సిద్ధమైందా?

నైరుతి రుతుపవనాల్లో రాష్ట్రం ఓ మోస్తరు వర్షాలు మాత్రమే చవిచూసింది. కానీ, పక్క రాష్ట్రమైన కేరళలో అధిక వర్షపాతం నమోదైంది. ఈ క్రమంలో జూన్ 30వ తేదీ ఎడతెరిపి లేకుండా 57.2 సెం.మీ వర్షం కురవడంతో వయనాడులో భారీ వరదలు, కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ విపత్తులో చిక్కుకొని 350 మందికి పైగా మృతిచెందగా, 200 మంది గల్లంతయ్యారు. ఇలాంటి ప్రమాదకర పరిస్థితులు ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో తమిళనాడులోనూ సంభవించే అవకాశముందని వాతావరణ పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. అందుకు పశ్చిమ కనుమల సరిహద్దు జిల్లాల్లో ముందస్తు చర్యలు చేపట్టేలా రాష్ట్రప్రభుత్వం చొరవచూపాలని వారు సూచిస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు వరదముంపును రాష్ట్రం ఎదుర్కొంది. అలాంటి ఘటనలు నేర్పిన గుణపాఠంతో రాబోయే ఈశాన్య రుతుపవనాల విపత్తును ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం సిద్ధమైందా అన్న ప్రశ్నకు సరైన సమాధానం వినిపించడం లేదు.

కాలువల్లా రోడ్లు ...

2015 డిసెంబరులో కురిసిన అతిభారీ వర్షాలతో, పూర్తిగా నిండిన చెంబరంబాక్కం జలాశయం నుంచి అదనపు జలాలను అడయారు నదికి వదలడంతో తీరప్రాంతాలు వరద ముంపులో చిక్కుకున్నాయి. సైదాపేట వంతెన మీద నుంచి వరద నీరు ప్రవహించే దృశ్యాలను నేటికీ నగర ప్రజలు మరచిపోలేదు. అలాగే, గత ఏడాది నవంబరు-డిసెంబరు నెలల్లో నగరంలో భారీవర్షాలు కురిశాయి. ముంపు ప్రాంతాల్లో భారీగా వరద నీరు చేరగా, ఆ ప్రాంతాల వారిని పడవల ద్వారా రక్షించాల్సిన పరిస్థితి వచ్చింది.

దక్షిణ జిల్లాలు అతలాకుతలం...

దక్షిణాది జిల్లాల్లో గత నెల 16, 17, 18 తేదీల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా తిరునల్వేలి, తూత్తుకుడి, కన్నియాకుమారి, తెన్‌కాశి జిల్లాలు వరద ముంపునకు గురయ్యాయి. ముఖ్యంగా, తిరునల్వేలి, తూత్తుకుడి జిల్లాలు వందేళ్లలో లేని విధంగా భారీ నష్టాన్ని చవిచూశాయి. నదులు, చెరువులు, పంట కాలువలు, కొలనులు ఆక్రమించడంతో వరద నీరు సక్రమంగా పారే వీలులేక జనావాస ప్రాంతాలను ముంచెత్తుతున్నాయి. ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట పడుతోందా అన్నదానిపై ఇప్పుడు అన్ని వర్గాలు దృష్టి సారించాల్సివుంది.

వ్యర్థాలతో పూడుకుపోయిన జలాశయాలు...

రాష్ట్రంలోని మొత్తం 38 జిల్లాల్లో 25 కార్పొరేషన్లు, 148 మున్సిపాలిటీలు, 488 పట్టణ పంచాయతీలు, 12,618 గ్రామ పంచాయతీలున్నాయి. వీటిలో కుంటలు, కొలనులు, చెరువులు కలిపి 39,202 నీటివనరులున్నాయి. ప్రతి ఏడాది బడ్జెట్‌లో రుతుపవనాలకు ముందు జలవనరుల పూడికతీత, పటిష్టతకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుంది. ఈ పనులు పూర్తిచేస్తే వరద నీరు సక్రమంగా సముద్రంలో కలిసే అవకాశముంటుంది.

వరద ముంపునకు గురయ్యే ప్రాంతాలు...

రాష్ట్రంలో 3,916 ప్రాంతాలు వరద ముంపునకు గురవుతాయని విపత్తుల నిర్వహణశాఖ గుర్తించింది. జిల్లాల వారీగా పరిశీలిస్తే అధికంగా చెంగల్పట్టులో 389 ప్రాంతాలు, చెన్నైలో 322, కడలూరులో 293, నీలగిరిలో 284, మైలాడుదురై జిల్లాలో 228 ముంపు ప్రాంతాలున్నాయి.

మా మధ్య విభేదాల్లేవ్ !

● స్టాలిన్‌తో భేటీ అనంతరం తిరుమావళవన్ ప్రకటన

● అంచెలంచెలుగా మద్యం దుకాణాలు మూసేస్తే చాలు: డీపీఐ

● తిరుమాను మా నుంచి విడదీయలేరు: కాంగ్రెస్ ● అదంతా కపటనాటకం: తమిళిసై



సీఎం స్టాలిన్‌ను సత్కరిస్తున్న డీపీఐ నేత తిరుమావళవన్

తిరుమాను విడదీయలేరు: కాంగ్రెస్, సీపీఐ

డీఎంకే కూటమి నుంచి డీపీఐ నేత తిరుమావళవన్‌ను వేరు చేయలేరని టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు ఈవీకేఎస్ ఇళంగోవన్, సీపీఐ రాష్ట్ర కమిటీ కార్యదర్శి ముత్తరసన్ పేర్కొన్నారు. తిరుమావళవన్ ఎల్లప్పుడూ సెక్యులరిజాన్ని, కులనిర్మూలనను కోరుకుంటారని, తమిళభాషను పరిరక్షించడంలోనూ కీలకపాత్ర పోషిస్తున్నారని ఇళంగోవన్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. డీఎంకే కూడా సెక్యులరిజం, తమిళ భాషాభివృద్ధిని కోరుకుంటుందన్నారు. భవిష్యత్తులోనూ డీపీఐ డీఎంకే కూటమిలోనే కొనసాగుతుందన్నారు. సీపీఐ నేత ముత్తరసన్ విడుదల చేసిన ప్రకటనలో డీఎంకే కూటమిలో చీలికలు తెచ్చేందుకు ప్రత్యర్థులు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారని ఆరోపించారు. సీపీఐ, సీపీఎం పార్టీలు, డీపీఐ, కాంగ్రెస్ పార్టీలున్న డీఎంకే కూటమి గతం కంటే మరింత పటిష్టంగా మారిందని ఆయన తెలిపారు.

చెన్నై, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): డీఎంకే, డీపీఐ పార్టీల మధ్య ఎలాంటి విభేదాలు లేవని, రెండు పార్టీలూ సిద్ధాంతపరంగా స్థిరత్వంతో ఉన్నాయని ఆ పార్టీ అధినేత తిరుమావళవన్ ప్రకటించారు. సోమవారం ఉదయం తిరుమావళవన్ అన్నా అరివాలయంలో డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కలుసుకున్నారు. డీపీఐ ఆధ్వర్యంలో అక్టోబర్ 2న నిర్వహించనున్న మద్యనిషేధ మహానాడులో పాల్గొనాలని ఆహ్వానించారు. ఈ సమావేశానంతరం అరివాలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ... అధికారంలో భాగస్వామ్యం అంటూ తన ఎక్స్ పేజీలో వెలువడిన వీడియో గురించి స్టాలిన్ తనతో ఎలాంటి ప్రస్తావన చేయలేదన్నారు. కళ్ళకురిచ్చిలో అక్టోబర్ 2న నిర్వహించనున్న మహానాడుకు స్టాలిన్‌ను ఆహ్వానించినట్లు చెప్పారు. అదే సమయంలో రెండు కోరికలతో ఆయనకు వినతి పత్రం కూడా సమర్పించామని, రాష్ట్రంలో మద్యం దుకాణాల అమ్మకాల టార్గెట్ తగ్గించాలని, దేశవ్యాప్తంగా సంపూర్ణ మద్య నిషేధం అమలుకు అన్ని రాష్ట్రాలు సహకరించేలా చర్యలు ప్రారంభించాలని డిమాండ్ చేసినట్లు చెప్పారు. అమెరికా పర్యటన నుంచి తిరిగొచ్చిన ముఖ్యమంత్రికి తాను, తన పార్టీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేశామన్నారు. తన వినతిపత్రాన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి సంపూర్ణ మద్య నిషేధమే డీఎంకే ప్రధాన ఆశయమని, ఆ దిశగా చర్యలు చేపట్టేందుకు పాలనపరమైన చిక్కులను, సమస్యలను అధిగమించాల్సి ఉందన్నారు. అంతే కాకుండా తమ పార్టీ నిర్వహించనున్న మద్యనిషేధ మహానాడులో డీఎంకే తరఫున ఆ పార్టీ వ్యవస్థాపక కార్యదర్శి ఆర్ఎస్ భారతి, అధికార ప్రతినిధి టీకేఎస్ ఇళంగోవన్ పాల్గొంటారని హామీ ఇచ్చారన్నారు. రాష్ట్రంలో మద్యనిషేధం అమలు చేయాలని ఆశించే పార్టీల నాయకులు తాము నిర్వహించనున్న మహానాడులో పాల్గొనటానికి ఎలాంటి అభ్యంతరాలు లేవని ఆయన స్పష్టం చేశారు.

అంచెలంచెలుగా మూసేస్తే చాలు..

రాష్ట్రంలో అంచెలంచెలుగా మద్యం దుకాణాలను మూసివేయాలన్న డిమాండ్‌తోనే డీపీఐ ఆధ్వర్యంలో మద్యనిషేధ మహానాడు జరుపుతున్నట్లు తిరుమావళవన్ అన్నారు. జాతీయ స్థాయిలో సంపూర్ణ మద్య నిషేధం అమలు దిశగా చర్యలు చేపట్టాలని సీఎం స్టాలిన్‌కు విజ్ఞప్తి చేస్తున్నట్లు చెప్పారు. రాజకీయ ప్రాబల్యం కోసం తాము మద్యనిషేధ మహానాడు జరుపటం లేదని, సంపూర్ణ మద్యం నిషేధం అమలుచేయలన్నదే తమ ప్రధాన లక్ష్యమన్నారు.

కపట నాటకం...

మద్యనిషేధం పేరుతో డీఎంకే, డీపీఐ పార్టీలు కపట నాటకమాడుతున్నాయని తెలంగాణా మాజీ గవర్నర్ డాక్టర్ తమిళిసై విమర్శించారు. ఈ మేరకు ఆమె విడుదల చేసిన ప్రకటనలో అధికారంలో భాగస్వామ్యం కోరుతామని ఢాంబికాలు పలికిన తిరుమావళవన్ సోమవారం స్టాలిన్‌ను కలుసుకుని తమ రెండు పార్టీల మధ్య విభేదాలు లేవని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తొలుత రాష్ట్రంలో సంపూర్ణ మద్య నిషేధం అమలు చేయాలని డిమాండ్ చేసిన డీపీఐ.. స్టాలిన్‌తో ఆ పార్టీ నేత తిరుమావళవన్ కలుసుకున్న తర్వాత జాతీయ స్థాయంలో మద్యనిషేధం అమలు చేయాలని డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

సమాచార దర్శిని

అశ్వగంధ పాల విక్రయాలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 16: ఆయుధపూజకు ముందు అశ్వగంధ పాలు, రోజ్‌మిల్క్ విక్రయాలు ప్రారంభించాలని ఆవిన్ సంస్థ నిర్ణయించింది. ఈ సంస్థ పాలతో పాటు 230కి పైగా పాల పదార్థాలను తయారుచేసి విక్రయిస్తోంది. ఇటీవల నూడిల్స్, చాక్లెట్, స్ట్రాబెర్రీ, కుల్ఫీ, కోల్డ్ కాఫీ వంటి 25కు పైగా ఉత్పత్తుల తయారీ నిలిపివేసింది. ఈ నేపథ్యంలో, వినియోగదారులను ఆకట్టుకొనేలా రోజ్ మిల్క్, మూలికా మిశ్రమాల అశ్వ గంధ పాలు విక్రయించేందుకు చర్యలు చేపట్టింది.

29న అప్రెంటీస్ అభ్యర్థుల ఎంపిక శిబిరం

ఐసిఎఫ్, సెప్టెంబరు 16: అప్రెంటిస్ అభ్యర్థుల ఎంపిక శిబిరం క్రోంపేటలో ఈ నెల 29వ తేది ఉదయం 10 గంటలకు జరుగనుంది. ఐటీఐ చేసిన విద్యార్థులకు మెకానిక్ డీజిల్, ఎలక్ట్రీషియన్, ఆటో ఎల క్ట్రీషియన్, వెల్డర్, ఫిట్టర్, టన్నర్, పెయింటర్ తదితర విభాగాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. 500 సీట్ల భర్తీకి 29వ తేది క్రోంపేటలో ఉన్న ఎంటీసీ వృత్తి శిక్షణ పాఠశా లలో అభ్యర్థుల ఎంపిక జరుగనుంది. ఆసక్తి కలిగిన వారు శిక్షణ పాఠశాలకు నేరుగా హాజరుకావాలని అధి కారులు తెలిపారు.

నేడు పనిచేయనున్న వండలూరు పార్క్

ఐసిఎఫ్, సెప్టెంబరు 16: మిలాద్ ఉన్ నబి పండు గను పురస్కరించుకొని మంగళవారం వండలూరు జువాలజికల్ పార్క్ తెరచి ఉంటుందని పార్క్ డైరెక్టర్ తెలిపారు. రాష్ట్రం, పొరుగు రాష్ట్రాల నుంచి ప్రతిరోజు వందలాది మంది పర్యాటకులు ఈ పార్కు సందర్శనకు వస్తుంటారు. ప్రతి మంగళవారం పార్క్‌కు సెలవుకాగా, పండుగలు, విశేష దినాల్లో పార్క్ యధా విధిగా తెరచి ఉంచుతారు. ఆ ప్రకారం, సెలవు రోజైన మంగళవారం యధావిధిగా పార్క్ పనిచేస్తుందని పార్క్ నిర్వాహకులు తెలిపారు.

రూ.75 లక్షలతో విరుగంబాక్కం కాలువ పూడికతీత

ఐసిఎఫ్, సెప్టెంబరు 16: స్థానిక విరుగంబాక్కం కాలువ పూడికతీత పనులు రూ.75 లక్షలతో జరుగుతు న్నాయి. వలసరవాక్కం మండలం నెర్‌కుండ్రంలో ప్రారంభమయ్యే ఈ కాలువ విరుగంబాక్కం, కోయం బేడు, నెర్‌కుండ్రం, వడపళని మీదుగా సాగి కూవం నదిలో కలుస్తోంది. ఈ కాలువ గుర్రపు డెక్కలు, వ్యర్థాలతో నిండింది. ఈ కాలువలో పూడికతీత పనులు ప్రారంభమయ్యాయి.

హిజ్రాల ఉన్నత విద్యకు ఆర్థికసాయం

ఐసిఎఫ్, సెప్టెంబరు 16: హిజ్రాల ఉన్నత విద్యకు ప్రభుత్వం ఆర్థికసాయం చేయనుందని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్దార్థ్ తెలిపారు. హిజ్రాలకు విద్య, హాస్టల్ ఫీజు తదితర అన్ని ఖర్చులు ప్రభుత్వం భరిం చనుందని, ఈ పథకంలో రాష్ట్రానికి చెందిన హిజ్రాల సంక్షేమ బోర్డులో పేరు నమోదుచేసుకున్న వారు దర ఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మెడిసిన్, ఇంజనీరింగ్, లా కోర్సు చేసే వారు కూడా ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని సంప్రదించాలని వెల్లడించారు.

17,810 పాఠశాలల్లో తనిఖీలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 16: పాఠశాల విద్యాశాఖ ఆదే శాల మేరకు ఆగస్టులో 17,810 పాఠశాలల్లో అధికా రులు తనిఖీలు నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల వారీగా పాఠశాలల్లో తనిఖీలు నిర్వ హించి వివరాలు తెలియజేయాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అధికారులకు ఉత్తర్వులు జారీచేసింది. ఆ ప్రకారం ప్రాథమి, మాధ్యమిక అని మొత్తం నెల రోజుల్లో 17,810 పాఠశాలల్లో అధికారులు తనిఖీలు నిర్వహించారు.

ఎనిమిది నెలల్లో 1,086 అవయవాల దానం

ఐసిఎఫ్, సెప్టెంబరు 16: రాష్ట్రంలో అవయవదానం చేసే వారి సంఖ్య పెరిగింది. గత ఎనిమిది నెలల్లో 1,086 అవయవాలు దానం చేశారు. దేశంలో తొలిసా రిగా రాష్ట్రంలో 2008 సంవత్సరంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి మెదడు నిర్జీవమైన వారి అవయవాల దానం పొందే పథకం ప్రారంభించారు. అవయవదానం చేసే వారికి ప్రభుత్వ లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటిం చింది. దీంతో అవయవదానం చేసేందుకు ముందు కొచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. ఆ ప్రకారం, గత ఎని మిది నెలల్లో 192 మంది అవయవాలు దానం చేశారు. వారి నుంచి కిడ్నీ, శ్వాసకోశం, గుండె, కాలేయం, కార్ని యా వంటి 1,086 అవయవాలు దానంగా పొందారు.

కోడిగుడ్ల పెంకులు వేరుచేసే యంత్రాలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 16: పౌష్టికాహార పథకంలో అందజేసే కోడిగుడ్డు పెంకులు వేరుచేసే యంత్రాలను ఏర్పాటుచేయనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ అధికా రులు తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠ శాలల్లో 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో కోడిగుడ్లు అందజేస్తున్నారు. ఎక్కువ మంది విద్యార్థులున్న పౌష్టికాహార కేంద్రాల్లో కుక్‌లు కోడిగుడ్ల పెంకులు వేరు చేసేందుకు ఇబ్బంది పడుతు న్నారు. దీన్ని గుర్తించిన సాంఘిక సంక్షేమ శాఖ తొలివి డతగా 400 పౌష్టికాహార కేంద్రాలకు ఆధునిక కోడి గుడ్ల పెంకులు వేరు చేసే యంత్రాలను అందజేయా లని నిర్ణయించింది. ప్రభుత్వ అనుమతి లభించగానే వీటిని త్వరలో అందజేస్తామని అధికారులు తెలిపారు.

ఇంట్లో మద్యం విక్రయం... మహిళ అరెస్ట్

ఐసిఎఫ్, సెప్టెంబరు 16: శ్రీపెరుంబుదూర్ సమీ పంలో ఇంట్లో మద్యం విక్రయిస్తున్న మహిళను పోలీ సులు అరెస్ట్ చేశారు. కీవలూరు తండుమారియమ్మన్ ఆలయ వీధిలోని ఓ ఇంట్లో టాస్మాక్ దుకాణం నుంచి మద్యం కొనుగోలు చేసి అదనపు ధరకు విక్రయిస్తు న్నట్లు శ్రీపెరుంబుదూర్ పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు తనిఖీ చేసి 175 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని, పూసనై అనే మహిళను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

సీబీఐ ఎదుట మాజీ ఐజీ హాజరు

చెన్నై, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విగ్రహాల స్మగ్ల ర్లకు మద్దతుగా వ్యవహరించారనే ఆరోపణలపై నమో దైన కేసులో రాష్ట్ర విగ్రహాల అక్రమ రవాణా నిరోధకవి భాగం మాజీ ఐజీ పొన్ మాణిక్కవేల్ సీబీఐ కార్యాల యంలో హాజరయ్యారు. హైకోర్టు బెయిలు నిబంధనల ప్రకారం సోమవారం ఉదయం ఆయన నుంగంబాక్కం లోని సీబీఐ కార్యాలయానికి వెళ్లి రిజిస్టర్‌లో సంతకం చేశారు. విగ్రహాల నిరోధక విభాగాం డీఎస్పీ ఖాదర్ బాషా ఫిర్యాదు మేరకు సీబీఐ కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే.

మాతా ఆలయం తొలగింపు
తిరువెన్నైనల్లూర్‌లో ఉద్రిక్తత

పెరంబూర్, సెప్టెంబరు 16: విల్లుపురం జిల్లా తిరువెన్నై నల్లూర్ సమీపంలోని కాలువ ఆక్రమించి నిర్మించిన మాతా ఆలయాన్ని పోలీసు భద్రత నడుమ తొలగించారు. ఆల యాన్ని కూల్చివేయడాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టిన గ్రామస్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. తిరువెన్నైనల్లూర్ సమీపం పరుగంపట్టు గ్రామంలో రాఘవన్ పంట కాలువ ఏర్పాటుచేశారు. ఈ కాలువ నుంచి తిరువెన్నైనల్లూర్ చెరు వుకు నీరు వెళ్లేందుకు ఏర్పాటుచేసిన చిన్న కాలువపై మూడేళ్ల క్రితం మాత ఆలయాన్ని నిర్మించిన కొందరు గ్రామస్తులు ప్రార్థనలు చేస్తుంటారు. కాగా, కాలువపై ఆక్రమణలు తొలగించాలంటూ కవిత దాఖలుచేసిన పిటి షన్ విచారించిన మద్రాసు హైకోర్టు, కాలువ ఆక్రమించి నిర్మించిన ఆలయం తొలగించి నివేదిక దాఖలుచేయా లంటూ విల్లుపురి జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు జారీచే సింది. ఆలయం కూల్చివేతకు సంబంధించి అవకాశమివ్వా లని గ్రామస్తులు కోరడంతో రెవెన్యూ అధికారులు పలు విడతలుగా గడువు పొడించారు. ఈ నేపథ్యంలో, సోమ వారం ఉదయం పోలీసులు, ఎక్సక వేటర్లతో అక్కడకు చేరుకున్న రెవెన్యూ అధికారులు ఆల యం తొలగించేం దుకు యత్నించారు. దీనికి నిరసనగా సుమారు 200 మందికి పైగా చిన్నా రులు, మహిళలు, పురుషులు ఆలయం ముందు, పైకి ఎక్కి అడ్డుకున్నారు. దీంతో, వారికి బలవంతంగా అక్కడకు నుంచి తీసుకెళ్లారు. గ్రామ స్తులు, పోలీసుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. యంత్రంతో ఆలయాన్ని కూల్చుతున్న దృశ్యం చూసిన ఓ మహిళ స్పృహ తప్పి పడిపోవడంతో ఆమెను ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన కారణంగా కడలూరు-చిత్తూర్ మధ్య వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



ఆలయం కూల్చివేతపై గ్రామస్తుల నిరసన (పక్క చిత్రంలో) కూల్చివేసిన ఆలయం

మహిళలున్నా ఆగని ప్రభుత్వ బస్సు

● డ్రైవర్, కండక్టర్‌పై సస్పెన్షన్ వేటు

పెరంబూర్, సెప్టెంబరు 16: మహిళలు చేయూపి ఆపాలని కోరినా, నిర్లక్ష్యంగా వెళ్లిన ప్రభుత్వ బస్సు డ్రైవర్, కండక్టర్‌పై సస్పెన్షన్ వేటుపడింది. కన్నియాకుమారి జిల్లా వడచేరి నుంచి సుశీంద్రం, ఆళగప్పురం మీదుగా తిరునల్వేలి జిల్లా కూట్టపులికి ఈ నెల 13వ తేది సాయం త్రం బయల్దేరిన ప్రభుత్వ బస్సు అళగప్పురం వెళ్తుండగా బస్టాండ్‌లో నిలబడిన ఇద్దరు మహిళలు బస్సు ఆపా లంటూ చేతులూపినా, బస్సు ఆగకుండా వెళ్లింది. దీంతో, కొందరు యువకులు ద్విచక్రవాహనంపై వెళ్లి బస్సును అడ్డుకొని డ్రైవర్, కండక్టర్‌తో వాగ్వివాదానికి దిగారు. అం దుకు డ్రైవర్ తప్పయి పోయిందని, క్షమించాలని వారిని బతిమాలి, అక్కడి నుంచి బస్సు తీసుకెళ్లాడు. తాజాగా డ్రైవర్‌ను యువకులు ప్రశ్నిస్తున్న దృశ్యాలు సోషల్ మీడి యాలో వెలువడగా, ఈ వ్యవహారంపై రవాణా శాఖ అధి కారులు విచారణకు ఆదేశించారు. అలాగే, మహిళలు కోరినా బస్సు ఆపకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన డ్రైవర్ స్టీపెన్, కండక్టర్ మణికంఠన్‌లను సస్పెండ్ చేస్తూ నాగర్‌కోయిల్ మండల రవాణా శాఖ జనరల్ మేనేజర్ మెర్లిన్ జయంతి ఉత్తర్వులు జారీచేశారు.

ఆరేళ్ల బాలుడి అద్వితీయ ప్రతిభ

● కుండపై నిలబడి పదినిమిషాల్లో 140 శరాలు సంధించిన బాలుడు



కుండలపై నిలబడి బాణాలు వదులుతున్న నితీష్

పెరంబూర్, సెప్టెంబరు 16: కుండపై నిలబడి పది నిముషాల్లో 140 బాణాలు విసిరి ఓ బాలుడు సాధన చేశారు. మొగప్పెర్‌కు చెందిన నితేష్ (6) ప్రస్తుతం 1వ తరగతి చదువుతున్నాడు. మూడేళ్ల ప్రాయం నుంచే నితీష్‌కు విలు విద్య అంటే ఆసక్తి మెండు. అందుకోసం 5వ ఏట నుంచి అదే ప్రాంతంలోని అర్జున విలువిద్య అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. విలువిద్యలో ఏదైన సాధన చేయాలనుకుని కుండపై నిలబడి 10 నిమిషాల్లో 140 బాణాలు వదలాలని నిర్ణయించుకున్నాడు. అకాడమీ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో నితీష్ కుండపై నిలబడి 10 నిముషాల 22 సెకన్లలో 140 బాణాలు వదిలాడు. బాలుడి సాధన 'వరల్డ్ యంగ్ అచీవర్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో నమోదుచేసిన నిర్వాహకులు, నితీష్‌కు సర్టిఫికేట్ అందజేశారు.

రూ.500 కోట్ల ప్రభుత్వ స్థలం స్వాధీనం



పాఠశాల గేటుకు సీలు వేస్తున్న అధికారులు

పెరంబూర్, సెప్టెంబరు 16: తిరు వళ్లూర్ జిల్లా చెంబరంబాక్కం సమీ పంలో ఆక్రమణకు గురైన రూ.500 కోట్ల విలువైన 25 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్న అధికా రులు, ప్రైవేటు పాఠశాలకు సీలు వేశారు. పలంజూర్ గ్రామంలో 5 ఎకరాల స్థలాన్ని 1993లో లీజుకు తీసుకున్న సెయింట్ జాన్స్ అనే విద్యాసంస్థ, మరో 20 ఎకరాలు ఆక్ర మించి పాఠశాల నడుపుతుందని ఆరో పణలున్నాయి. 2013లో లీజు గడువు ముగిసిన నేపథ్యంలో, సదరు విద్యా సంస్థ రూ.22 కోట్ల బకాయి ఉంచింది. దీంతో, జిల్లా కలెక్టర్ ఉత్తర్వులతో సోమవారం ఉదయం రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకొని పాఠశాలకు సీలు వేశారు.

ఏటీఎం బద్దలుకొట్టి చోరీకి యత్నం

పెరంబూర్, సెప్టెంబరు 16: స్థానిక పెరంబూర్‌లో ఏటీఎం మెషీన్ బద్దలుకొట్టి చోరీ యత్నించిన వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. పెరంబూర్ రాఘవన్ రోడ్డులో ఐఓబీ ఏటీఎం ఉంది. ఆదివారం అర్ధరాత్రి జనసంచారం లేని సమయంలో కొందరు ఆగంతకులు ఏటీఎం తలుపులు బద్దలుకొట్టి లోనికి ప్రవేశించారు. మెషీన్‌ను ఇనుప రాడ్లతో ధ్వంసం చేసేందుకు యత్నించగా సైరన్ మోగింది. దీంతో, ఆగంతకులు అక్కడ నుంచి పారిపోయారు. సమాచారం అందుకున్న సెంబియం పోలీసులు ఏటీఎం కేంద్రం వద్దకు చేరుకొని, ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీ ఆధారంగా ఆగంతకుల కోసం గాలిస్తున్నారు.

వైభవంగా సేన్‌పాక్కం ఆలయ కుంభాభిషేకం

వేలూరు, సెప్టెంబరు 16: స్థానిక సేన్‌పాక్కంలో పురాతన స్వయంబు వినాయక ఆలయ మహాకుం భాభిషేకం 15 ఏళ్ల అనంతరం సోమవారం నిర్వహించారు. దేశంలోని పలు పుణ్యనదుల నుంచి తీసు కొచ్చిన పవిత్ర జలాల కలశాలను ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. వేడుకల్లో భాగంగా హోమాలు చేసి పూర్ణాహుతి నిర్వహించారు. మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ కలశాలను ఆలయ గోపురాల వద్దకు తీసుకెళ్లి పవిత్ర జలాలు ప్రోక్షించి కుంభాభిషేకం నిర్వహించారు.

ఆలయ ఏనుగు జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహిస్తున్న భక్తులు

పెరంబూర్, సెప్టెంబరు 16: మదురైలో ప్రసిద్ధిచెందిన కళ్లగర్ ఆలయ ఏనుగుకు సుందరవల్లి అని అమ్మవారి పేరు పెట్టారు. ఏనుగును సంరక్షించేందుకు ఆలయ నిర్వాహ కులు ఓ మావటిని కూడా నియమిం చారు. సుందరవల్లి జన్మదిన వేడుక లను ఆలయ నిర్వాహకులు, భక్తులు ప్రతి ఏడాది ఘనంగా నిర్వహిస్తుం టారు. ఈ క్రమంలో, సుందరవల్లి ఆది వారం 19వ ఏట అడుగిడింది. సుందర వల్లికి ప్రత్యేక స్నానాలు చేయించిన భక్తులు, అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. కేక్ కట్ చేసి భక్తు లకు పంచిపెట్టారు. సుందరవల్లికి ప్రత్యేక ఆహారాన్ని ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేశారు.

ప్రైవేటు ఆస్పత్రికి తాత్కాలిక స్టే

పెరంబూర్, సెప్టెంబరు 16: ఊబకాయం తగ్గిం చేందుకు శస్త్రచికిత్స చేయించుకున్న యువకుడు మృతి చెందిన వ్యవహారంలో ప్రైవేటు ఆస్పత్రి పనిచేసేందుకు అనుమతిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం తాత్కాలిక స్టే విధించింది. పుదుచ్చేరికి చెందిన హేమచంద్రన్ అనే యువకుడు పమ్మల్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో ఊబకా యం తగ్గించేందుకు ఏప్రిల్ 23వ తేది శస్త్రచికిత్స చేయిం చుకోగా మరుసటిరోజు మృతిచెందాడు. ఈ వ్యవహా రంలో ఆస్పత్రిని తనిఖీచేసిన చెంగల్పట్టు జిల్లా ఆరోగ్యశాఖ అధికారి, ఆస్పత్రి లైసెన్స్ తాత్కాలికంగా రద్దు చేస్తూ మే 4వ తేది ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వులపై ఆస్పత్రి యాజమాన్యం దాఖలుచేసిన పిటిషన్ విచారిం చిన మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి స్వామినాథన్... రోగి వద్ద అనుమతి తీసుకున్న తర్వాతే శస్త్రచికిత్స చేశా రని, ఆస్పత్రి నిర్వాహకుల వివరణ తీసుకోకుండా లైసెన్స్ రద్దు చేయడం సరికాదంటూ ఆ ఉత్తర్వులు రద్దు చేసి, ఆసుపత్రి పనిచేసేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వులపై రాష్ట్రప్రభుత్వం దాఖలుచే సిన అప్పీలు పిటిషన్‌ను హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి కృష్ణన్‌కుమార్, న్యాయమూర్తి బాలాజీ తో కూడిన ధర్మాసనం సోమవారం విచారించి, సింగిల్ జడ్జి ఉత్తర్వులపై తాత్కాలిక స్టే విధించడంతో పాటు పిటిష న్‌దారులకు నాలుగు వారాల్లో బదులివ్వాలని ప్రైవేటు ఆసుపత్రికి నోటీసు జారీచేశారు.

ఐసీయూలో రాష్ట్ర ఆరోగ్యశాఖ

● మాజీ మంత్రి చమత్కారం

పెరంబూర్, సెప్టెంబరు 16: రాష్ట్రంలో ప్రబలుతున్న డెంగ్యూ జ్వరాల నియంత్రణకు చర్యలు చేపట్టడంతో ఆరోగ్యశాఖ పూర్తిగా విఫలమైందని, అందుకు కారణం రాష్ట్ర ఆరోగ్యశాఖ ఐసీయూలో ఉండడమేనని అన్నాడీ ఎంకే మాజీ మంత్రి డి.జయకుమార్ చమత్కరించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ మంత్రి రామస్వామి పడయాచ్చి 107వ జయంతి సందర్భంగా గిండిలోని ఆయన విగ్రహానికి సోమవారం జయకుమార్ పూల మాల వేసి నివాళులర్పించారు. సరిహద్దులు దాటా రంటూ రాష్ట్ర జాలర్లపై శ్రీలంక నావికాదళం అమానుష దాడులు అడ్డుకోవడంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు విఫల మయ్యా యని విమర్శించారు.

తాళి కట్టకుండా పరారైన యువకుడు

● పోలీసులకు ఫిర్యాదు

పెరంబూర్, సెప్టెంబరు 16: వివాహ సమయంలో తాళి కట్టకుండా యువకుడు పరారయ్యాడని యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ వ్యవహారంపై పోలీ సుల కథనం మేరకు... కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన ఓ ప్రైవేటు బ్యాంక్ అధికారి మురుగేష్ కుమార్తె అనసూయ, అరక్కోణం సమీపం పళనిపేట ప్రాంతానికి చెందిన మాజీ పోలీసు అధికారి గోవిందస్వామి కుమా రుడు శ్రీధర్‌ను ప్రేమిస్తోంది. శ్రీధర్ బెంగళూరులోని ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. వీరి ప్రేమను ఇరుతరపు బంధువులు నిరాకరించడంతో, వీరిద్దరు నాలుగేళ్లుగా బెంగళూరులో ఎవరికి తెలియ కుండా సహజీవనం చేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో, వీరికి వివాహం చేసేందుకు ఇరు కుటుంబాలు అంగీకరిం చాయి. తిరుత్తణిలోని ఓ కల్యాణ మండపంలో ఆది వారం ఉదయం జరుగనున్న వివాహ కార్యక్రమానికి బంధువులు, స్నేహితులు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో, తాళి కట్టేందుకు కొన్ని గంటల ముందుగా శ్రీధర్ కల్యాణ మండపం నుంచి అదృశ్యమైనట్లు తెలిసింది. ఈ విష యమై గోవిందస్వామి తిరుత్తణి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదే సమయంలో అనసూయ కూడా తిరుత్తణి మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ విషయమై పోలీసులు విచారణ చేపట్టారు.

గంజాయి విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు వెయ్యిళ్లలో తనిఖీలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 16: గంజాయి విక్రయిస్తున్నారనే ఫిర్యాదులతో పోలీ సులు నగరం, శివారు ప్రాంతాల్లో 1,000 ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. ఆవడి డిప్యూటీ కమిషనర్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం తిరుమిలిసై సమీపంలోని కూడపాక్కం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఇళ్లల్లో తనిఖీలు నిర్వ హించారు. అక్కడ రౌడీలు తలదాచుకున్నారా, మత్తు పదార్థాలు దాచారా అని విచారించారు. ఆదివారం చెంగల్పట్టు జిల్లా కాటాన్‌కొళత్తూర్ ప్రాంతంలో 1,000 మందికి పైగా పోలీసులు తనిఖీలు నిర్వహించి 2.5 కిలోల గంజాయి, 4 వేటకొడవళ్లు, ఇతర మారణాయుధాలు స్వాధీనం చేసుకొని 21 మందిని అరెస్ట్ చేశారు.

చెన్నై-దోహా విమానం ఐదు గంటల ఆలస్యం

● అధికారులతో ప్రయాణికుల వాగ్వివాదం

పెరంబూర్, సెప్టెంబరు 16: చెన్నై నుంచి దోహా వెళ్లాల్సిన విమానం ఐదు గంటలు ఆలస్యంగా బయలుదేరడంతో ప్రయాణికులు అధికారులతో వాగ్వివా దానికి దిగారు. ఖతార్ దేశ రాజదాని దోహా నుంచి ఖత్తార్ ఎయిర్‌లైన్స్ విమానం వేకువజామున 3 గంటలకు చెన్నై చేరుకొని, మళ్లీ తెల్లవారుజా మున 4 గంటలకు చెన్నై నుంచి దోహాకు బయల్దేరుతుంది. ఈ నేపథ్యంలో, ఈ విమానంలో ప్రయాణించేందుకు టిక్కెట్లు రిజర్వ్ చేసుకున్న ప్రయాణి కులు వేకువజామున 1.30 గంటలకు చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. అంతలో 'సాంకేతికలోపం కారణంగా దోహా నుంచి చెన్నై రావా ల్సిన విమానం ఆలస్యంగా బయల్దేరిందని, అందువల్ల చెన్నై నుంచి తిరిగి వెళ్లే విమానం కూడా ఆలస్యమవుతుందని' అధికారులు ప్రకటించడంతో ప్రయాణికులు విమానాశ్రయంలోనే వేచి ఉన్నారు. తొలుత చెన్నై నుంచి ఉదయం 6.30 గంటలకు దోహా విమానం బయల్దేరుతుందని ప్రకటించిన అధికారులు, మళ్లీ 7.30 గంటలకు బయల్దేరుతుందని ప్రకటించారు. దీంతో, ప్రయాణికులు అధికారులతో వాగ్వివాదానికి దిగారు. అనంతరం దోహా విమానం 8 గంటలకు చెన్నై చేరుకుంది. ప్రయాణికులు ఎక్కిన తర్వాత ఐదు గంటల ఆలస్యంగా 9.30 గంటలకు బయల్దేరి వెళ్లింది.

లేడీస్ టాయ్‌లెట్‌లో చొరబడిన వృద్ధుడికి దేహశుద్ధి

చెన్నై, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఓట్టేరి ప్రాంతంలోని సినిమా థియేటర్‌లో మహిళల మరుగుదొడ్డిలో చొరబడిన వృద్ధుడిని మహిళలంతా చితకబాదారు. ఓట్టేరి ఎస్‌ఎస్‌పురానికి చెందిన రఘు (60) తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి అక్కడి సినిమా థియేటర్‌లో సినిమా చూడానికి వెళ్లారు. విరామ సమయంలో ఆయన తాగిన మైకంలో లేడీస్ టాయ్‌లెట్‌లోకి చొరబడ్డాడు. దీంతో భీతిల్లిన మహిళలు అతడికి దేహశుద్ధి చేశారు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన రఘును చికిత్స నిమిత్తం కీల్పాక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పుదువై జైలులో ఖైదీ ఆత్మహత్య



వివేకానందన్

పుదుచ్చేరి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పుదు చ్చేరి జైలులో ఓ ఖైదీ ఉరేసుకుని ఆత్మహత్య చేసు కున్నారు. ఆ ఖైదీ తొమ్మిదేళ్ల బాలికపై హత్యా చారం జరిపిన కేసులో అరెస్టయ్యాడు. తొమ్మిదేళ్ల బాలికపై గత మార్చిలో సామూహిక అత్యాచారా నికి పాల్పడడంతో ప్రాణాలు కోల్పోయింది. ఆ సంఘటనకు సంబంధించి ముత్యాలపేట ప్రాం తానికి చెందిన కరుణాస్ , వివేకానందన్‌లను అరెస్టు చేశారు. వీరిలో వివేకానందన్ సోమవారం ఉదయం జైలులోని మరుగుదొడ్డిలో ఉరేసుకుని ఆత్మ హత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని అతడి మృతదే హాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుదుచ్చేరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వేలూరులో సామాజిక న్యాయ ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, సెప్టెంబరు 16: ద్రవిడ ఉద్యమనేత తంథై పెరియార్ జయంతిని సామాజిక న్యాయ దినంగా పాటిస్తుంటారు. ఈ సందర్భంగా స్థానిక కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి పాల్గొని, కార్యాలయ ఉద్యోగులు, వివిధ శాఖల అధికారులతో సామాజిక న్యాయ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజ్‌కు మార్ (బాధ్యత), జిల్లా కలెక్టర్ పీఏ (జనరల్) ముత్తయ్యన్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సెంథిల్‌కుమార్, జిల్లా ఆదిద్రావిడుల సంక్షేమ అధికారి రామ చంద్రన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ మురుగన్, పంచాయతీల అసిస్టెంట్ డైరెక్టర్ కలియయూర్తి, రెవెన్యూ తహసీల్దార్ కవిత తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గేటు మూసివేత

వేలూరు, సెప్టెంబరు 16: నగరంలోని ఎల్సీ 128 రైల్వే గేటు ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. ఈ కారణంగా సోమవారం రాత్రి 8 నుంచి మంగళవారం రాత్రి 8 గంటల వరకు రైల్వే గేటు మూసివేస్తు న్నట్లు, ప్రజలు బెంగళూరు బైపాస్ మార్గంగా వెళ్లాని జిల్లా కలెక్టర్ సుబ్బు లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగుల పేరవై ఆందోళన



వేలూరు, సెప్టెంబరు 16: ఎస్సీ, ఎస్టీ ఉద్యో గులకు పదోన్న తుల్లో రిజర్వేషన్ కల్పిం చాలి, వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 11,000 పోస్టులు భర్తీ, పాత పింఛన్ విధానం అమలు తదితర కోర్కెల సాధనకు సోమవారం ప్రభుత్వ ఉద్యోగుల పేరవై ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సత్తువాచేరిలోని కలెక్టర్ కార్యాలయ సమీపంలో జరిగిన ధర్నాకు పేరవై జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజ్ నేతృత్వం వహించారు. కార్యక్ర మంలో డీపీఏ సెక్రటరీ నీల్‌చంద్రకుమార్, జిల్లా సెక్రటరీ ఫిలిప్ సహా పలు వురు నేతలు, కృష్ణగిరి, ధర్మపురి, వేలూరు, రాణిపేట, తిరుపత్తూర్ జిల్లాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

పెరంబూర్, సెప్టెంబరు 16: తిరువణ్ణామలై జిల్లా కలశపాక్కం సమీపంలో సోమ వారం ఓ కారును ప్రభుత్వ బస్సు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతిచెందారు. కళ్లకుర్చి జిల్లా పాడియందల్ గ్రామానికి చెందిన జ్ఞానశేఖరన్ (55), భార్య వలర్మతి (52), కోడలు జయంతి (22), మనవరాలు రితన్య (2)తో కలసి దేవికాపురంలోని బంధువు అంత్యక్రి యల్లో పాల్గొని, తిరిగి స్వగ్రామానికి బయల్దేరారు. తిరువణ్ణామలై-పేలూరు జాతీయ రహ దారి కలసపాక్కం సమీపం తెన్‌పల్లిపట్టు గ్రామం వద్ద ప్రభుత్వ బస్సు హఠాత్తుగా అదు పుతప్పి కారు సహా ద్విచక్రవాహనాన్ని ఢీకొని రోడ్డు పక్కనున్న చెట్టు ఢీకొంది. ఈ ఘట నలో కారు పూర్తిగా నుజ్జునుజ్జుకాగా, బస్సు ముందు భాగం దెబ్బతింది. ఈ ఘటనలో కారు డ్రైవర్ గోపినాథ్ (35), వలర్మతి మృతిచెందగా, మిగిలిన వారికి గాయాలయ్యాయి. అలాగే, ద్విచక్రవాహనంపై వెళుతున్న వేలు, బస్సులో ప్రయాణిస్తున్న ఒకరికి గాయాల య్యాయి. ఈ ఘటనపై కలసపాక్కం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు, బస్సు

ఆరణిలో రాతియుగం నాటి ఆనవాళ్లు

ఐసిఎఫ్, సెప్టెంబరు 16: తిరువణ్ణామలై జిల్లా సెయ్యారు-ఆరణి సమీపంలో రాతియుగం నాటి ఆనవాళ్లు బయల్పడ్డాయి. సెయ్యారు అరింజర్ అన్నా ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల చరిత్ర శాఖ అధ్యాపకుల ఆధ్వర్యంలో చరిత్ర పరిశోధన విద్యా ర్థులు విజయనగరం ప్రాంతంలో పరిశోధన చేపట్టారు. ఈ విషయమై వారు మాట్లాడుతూ... సెయ్యారు-ఆరణి మార్గంలో శక్తి విజయపురం ప్రాంతంలోని కమండలనాథ నదిలో పరిశోధనలు చేపట్టగా, అక్కడున్న నాలుగు బండరాళ్లలో చిన్న, పెద్ద అని నునుపైన గుంతలు కనిపించాయన్నారు. ఇదే విధంగా వాటి సమీపంలో 10 మీ చుట్టుకొలత ఉన్న బండల్లో 23 గుంతలు కనుగొన్నామన్నారు. ఈ గుంతలు 13-15 సెం.మీ పొడవు, 5-6 సెం.మీ వెడల్పు, 2-3 సెం.మీ లోతు కలిగి ఉన్నాయన్నారు. 4 నుంచి 10 వేల ఏళ్ల క్రితం జీవించిన మనుషులు తమ రాతి పరికరాలను సానపట్టినందుకు గుర్తులుగా ఉన్నాయని వివరించారు. ఇక్క డనే పూర్వీకులు శిబిరాలు ఏర్పాటుచేసుకొని బసచేసి ఉంటారని తెలిపారు. ఈ ఆనవాళ్ల ఆధారంగా మరిన్ని పరిశోధనలు చేపట్టనున్నామని తెలిపారు.



విజయనగరం ప్రాంతంలో కనుగొనిన రాతి గుంతలు



సినిమాల్లో కంటే బయటే రక్షణ తక్కువ

● శ్రద్ధా శ్రీనాథ్

ఇటీవలికాలంలో చిత్రపరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ అంశం పెను ప్రకంపనలు రేపుతోంది. ఈ అంశంపై అనేక మంది స్పందిస్తున్నారు. ఇందులో భాగంగా కథానాయకి శ్రద్ధా శ్రీనాథ్ స్పందించారు. 'క్యాస్టింగ్ కౌచ్‌పై పలువురు పలు విధాలుగా మాట్లాడుతున్నారు. అయితే, నా విషయానికి వస్తే మాత్రం ఎలాంటి చేదు అనుభవం లేదా సంఘటనలు ఎదుర్కోలేదు. నిజం చెప్పాలంటే సినిమాల కంటే బాహ్య ప్రపంచంలోనే మహిళలకు రక్షణ కరువైంది. సినీ ఇండస్ట్రీలో సంఘటనలు జరగడం లేదని, సమాజంలోనే మహిళలపై అధిక సంఖ్యలో నేరాలు ఘోరాలు జరుగుతున్నాయి. ఏదేని కార్యక్రమంలో పాల్గొని కారులో వెళ్ళే సమయంలో ఆ కారు డ్రైవర్ ఎలా ప్రవర్తిస్తాడోనన్న భయంతో ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఎదుర్కొంటున్నాను. ఒక్కమాటలో చెప్పాలంటే సమాజయంలో సౌకర్యవంతంగా, సహజసిద్ధంగా ప్రయాణించలేకపోతున్నాను' అని పేర్కొన్నారు.



ఆల్బమ్ సాంగ్ రిలీజ్ వేడుకలో సుహాసిని, మాధేష్, రెహానా తదితరులు

ఏఆర్.రెహానా 'మాత్తికాలమ్ మాలై'

ఆల్బమ్ సాంగ్ రిలీజ్

అకాడెమీ అవార్డు గ్రహీత ఏ.ఆర్.రెహ్మాన్ సోదరి, సంగీత దర్శకురాలు, నేపథ్యగాయని ఏఆర్.రెహానా రూపొందించిన ప్రైవేట్ ఆల్బమ్ సాంగ్ 'మాత్తికాలమ్ మాలై'. కోమల్ శర్మ, సనూజ్ నటించారు. ఎమిల్ మొహ్మద్ సంగీతం అందించగా, ఏఆర్.రెహానా తన బృందంతో కలిసి నేపథ్యగానం చేశారు. తమిళ సాహిత్యాన్ని గానా రుద్ర రాయగా, ఇంగ్లీష్ లిరిక్‌ను రమ్య రామ్ సి సమకూర్చారు. ఈ అల్బమ్ రిలీజ్ వేడుక సోమవారం ప్రసాద్ ల్యాబ్‌లో జరిగింది. ఇందులో సీనియర్ నటి సుహాసిని, సినీ దర్శకుడు మాధేష్ పాల్గొని ఈ సాంగ్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా సుహాసిని మాట్లాడుతూ, 'సంగీతం లేకుండా మనిషి జీవితం లేదు. సంగీతం మానవ జీవితంలో ఒక భాగం. నా జీవితంలో జరిగిన అనేక మంచి, చెడు సంఘటనలను ఆయా సందర్భాల్లో వచ్చిన పాటలతో కలిపి గుర్తుపెట్టుకుంటున్నాను.అలా మనిషిజీవితంలో సంగీతం ఒక భాగమైపోయింన్నారు. దర్శకుడు మాధేష్ మాట్లాడుతూ, 'ఏఆర్ రెహానా అల్బమ్స్ తయారీ, నేపథ్య గానంలో కూడా మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. 'జెంటిల్‌మేన్' చిత్రం నుంచి రెహానా కుటుంబంతో స్నేహ సంబంధాలున్నాయని అన్నారు. రెహానా మాట్లాడుతూ, 'ప్రాశ్చాత్య దేశాల్లో ఇండిపెండెంట్ ఆల్బమ్ సింగర్స్‌కు మంచి పేరు ప్రఖ్యాతలున్నాయి. కానీ, ఇక్కడ ఆ పరిస్థితి లేదు. ఆల్బమ్స్ సింగర్స్‌కు కూడా మంచి గుర్తింపు వచ్చి ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నదే నా ఆకాంక్ష అన్నారు. అలాగే, కోమల్ శర్మ, సనూజ్ తదితరులు ప్రసంగించారు.

చిత్రజ్యోతి

'రత్తమారే' బృందానికి రజనీ ప్రశంస



క్రౌడ్ ఫండింగ్ ప్రతినిధులతో రజనీకాంత్

భారత్, శ్రీలంకలోని జాఫ్నాకు చెందిన 13 మంది కలిసి జెర్మనీ ఫిలిమ్స్, వి2 క్రియేషన్స్, న్యూ జెర్సీ సంస్థలు సంయుక్తంగా క్రౌడ్ ఫండింగ్ విధానంలో నిర్మించిన చిత్రం 'రత్తమారే'. ఈ చిత్ర బృందాన్ని సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రత్యేకంగా అభినందించారు. లివింగ్ స్టన్, వయ్యాపురి, అమ్ము అభిరామి, ప్రసాద్, రమ, జనని తదితరులు నటించారు. ఈ సినిమా వివరాలను దర్శకుడు దినేష్ రవిచంద్రన్ వివరిస్తూ, 'చిత్రీకరణ తుది దశకు చేరుకున్నాయి. నా జీవితంలో నేను చూసిన, నన్ను బాధించిన, ఈ సమాజంలో మార్పు తీసుకుని రావాల్సిన పలు అంశాలను ఇందులో నొక్కి చెప్పడం జరిగింది. రజనీకాంత్ నటించిన 'జైలర్' చిత్ర పాటలోని 'రత్తమారే' అనే పదాన్ని ఈ సినిమా టైటిల్‌గా ఖరారు చేశాం. ఇదే విషయంపై సూపర్‌స్టార్‌ను కలువగా ఆయన మా చిత్ర బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు' అని పేర్కొన్నారు.



తమిళంలో మంచి పాత్రలు లభిస్తున్నాయి

● మంజు వారియర్

ఇతర భాషల్లో కంటే కోలీవుడ్‌లో మంచి కథా పాత్రల్లో నటించే అవకాశాలు వస్తున్నాయని హీరోయిన్ మంజు వారియర్ అన్నారు. సూపర్‌స్టార్ రజనీకాంత్ 'వేట్టయన్' చిత్రంలో మంజు వారియర్ నటిస్తున్నారు. ఈ అవకాశంపై ఆమె స్పందిస్తూ, 'వేట్టయన్ చిత్రంలో రజనీకాంత్ భార్యగా నటించాను. నా పాత్ర పేరు తార. రజనీ వివిధ రకాలైన స్టైల్స్ ఇపుడు చూస్తున్నాను. 'వేట్టయన్' చిత్రంలో అవకాశం రావడం, రజనీ సరసన నటించడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ సినిమాలోని 'మానసిలాయో' పాటకు అనేక మంది సినీ కళాకారులతో కలిసి డ్యాన్స్ చేసిన అనుభవం ఎన్నటికీ మరిచిపోలేనిది. ఇతర భాషల్లో కంటే తమిళంలో మంచి పాత్రలు లభిస్తున్నాయి. 'అరసన్' నుంచి 'తుణివు' చిత్రం వరకు నేను పోషించిన పాత్రలు పూర్తి భిన్నంగా ఉన్నాయి. 'వేట్టయన్' చిత్రంలో మరో కొత్త పాత్ర పోషించాను. 'విడుదలై-2', 'మిస్టర్ ఎక్స్'లో కూడా నేను పోషించిన పాత్రలు అలాంటివే' అని పేర్కొన్నారు.



అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కార్పొరేషన్ కమిషనర్ కుమారగురుబరన్

పోలింగ్ కేంద్రాల మార్పుపై ఈసీ అఖిలపక్ష సమావేశం

చెన్నై, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చెన్నై జిల్లా పరిధిలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాల మార్పులు చేపట్టడంపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ అఖిలపక్ష నేతల సలహాలు, సూచనలు స్వీకరించింది. చెన్నై కార్పొరేషన్ ప్రధాన కార్యాలయమైన రిప్పన్ భవనంలో సోమవారం ఉదయం అఖిలపక్ష సమావేశం జరిగింది. జిల్లా ఎన్నికల అధికారిగా బాధ్యతలు నిర్వర్తిసున్న గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కమిషనర్ కుమారగురుబరన్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. వచ్చే యేడాది జనవరి ఒకటో తేదీ 18 యేళ్లలోపువారికి ఓటు హక్కు కల్పించేలా పేర్లను ఓటర్ల జాబితాలో చేర్చటం, అదే సమయంలో కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, కొన్ని పోలింగ్ కేంద్రాల మార్పు తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. నగర పరిధిలో ఉన్న 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాల మార్పునకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల జాబితాను ఆగస్టు 29న విడుదల చేశారు. ఆ జాబితా పరిశీలించిన కొన్ని రాజకీయ పార్టీలు తమకు తోచిన మార్పులకు సంబంధించి ప్రతిపాదనలు కూడా చేశాయి. ఆ ప్రకారం చెన్నై జిల్లా పరిధిలో ఉన్న 3719 పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన మీదట కొత్తగా మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడానికి, 33 పోలింగ్ కేంద్రాలను విభజించడానికి, నాలుగు పోలింగ్ కేంద్రాలను విలీనం చేయడానికి 78 పోలింగ్ కేంద్రాలను కొత్త భవనాల్లోకి మార్చటానికి, మూడు పోలింగ్ కేంద్రాల పేర్లు మార్పు చేయడానికి సరికొత్త ప్రతిపాదనలు ఈ సమావేశంలో చర్చకు వచ్చాయి. వచ్చే యేడాదికి సంబంధించి సవరించిన ఓటర్ల జాబితాను ఈ నెల 29న విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ సమావేశంలో డీఎంకే, అన్నాడీఎంకే పార్టీల ప్రతినిధులు, ఆ పార్టీల మిత్రపక్షాలకు చెందిన ప్రతినిధులు, జిల్లా రెవెన్యూ అధికారి (ఎన్నికలు) పీకే సురేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

రాజ్‌నాథ్‌తో గరుడ ఏరో స్పేస్ సీఈవో భేటీ



చెన్నై, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో 'గరుడ ఎయిరో స్పేస్ కంపెనీ సీఈవో అగ్నిశ్వర్ జయప్రకాష్ సోమవారం ఢిల్లీలో భేటీ అయ్యారు. దీని గురించి అగ్నిశ్వర్ మీడియాతో మాట్లాడుతూ.. దేశంలో డిఫెన్స్ డ్రోన్‌ల అభివృద్ధి చేయడంలో గరుడ ఏరోస్పేస్ పాత్రను రక్షణశాఖ మంత్రికి వివరించినట్లు తెలిపారు. 'మేక్ ఇన్ ఇండియా' పథకంలో తాము భాగస్వాములవుతున్నందుకు రక్షణమంత్రి అభినందించినట్లు తెలిపారు. ఫ్రాన్స్‌లోని థేల్స్, ఇజ్రాయెల్‌లో వున్న అగ్రోవింగ్, గ్రీస్‌లోని స్పిరిట్ ఏరోనాటిక్స్ వంటి కంపెనీలతో తాము భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నామని, వీటన్నింటి గురించి తాము రాజ్‌నాథ్‌సింగ్‌కు వివరించగా, ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారని వివరించారు.

ఎట్టకేలకు తెరుచుకున్న ఎట్టియమ్మన్ ఆలయం



కలెక్టర్, ఎస్పీ పర్యవేక్షణలో పూజల్లో పాల్గొన్న దళితులు

పెరంబూర్, సెప్టెంబరు 16: తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి సమీపంలోని వలుతలంబేడు గ్రామంలో దళిత వర్గాలు పూజలు చేసేందుకు వ్యతిరేకించిన నేపథ్యంలో, సీలు వేసిన ఎట్టిమమ్మన్ ఆలయాన్ని నెల రోజుల అనంతరం సోమవారం మళ్లీ తెరిచారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ సమక్షంలో దళిత వర్గాలు స్వామి దర్శనం చేసుకున్నాయి. వలుతంబేడు గ్రామంలో ఉన్న ఎట్టియమ్మన్ ఆలయాన్ని హిందూ దేవాదాయశాఖ పర్యవేక్షిస్తోంది. 2002లో ఆలయ మహాకుంభాభిషేకం సందర్భంగా దళితులు, మరో వర్గం మధ్య తలెత్తిన ఘర్షణల కారణంగా ఆలయానికి సీలు వేశారు. అనంతరం 2011లో ఆలయాన్ని మళ్లీ తెరిచారు. ఈ క్రమంలో, 13 ఏళ్ల అనంతరం, ఎట్టియమ్మన్ ఆలయ కుంభాభిషేకం నిర్వహించాలని గ్రామస్తులు నిర్ణయించారు. వేడుకల కోసం జీర్ణోద్ధరణ పనులు ప్రారంభించగా, దళితులు నుంచి విరాళాలు తీసుకొనేందుకు మరో వర్గం అభ్యంతరం తెలిపినట్లు సమాచారం.

తహసీల్దార్ కార్యాలయంలో శాంతి చర్చలు...

గతంలో ఘర్షణలు జరిగిన దృష్ట్యా.. గత నెల 8వ తేది గుమ్మిడిపూండి తహసీల్దార్ శాంతి తన కార్యాలయంలో ఇరువర్గాల ప్రతినిధులతో చర్చించారు. కుంభాభిషేకం రోజున ఇతర వర్గాలు ఉదయం, దళితులు మధ్యాహ్నం పూజలు చేసేందుకు ఇరుతరపువారు అంగీకరించడంతో, కుంభాభిషేకానికి ప్రభుత్వం అంగీకరించింది. ఆ ప్రకారం, గత నెల 9వ తేది ఎట్టియమ్మన్ ఆలయ కుంభాభిషేకం జరిగింది. ఉదయం ఇతర వర్గాలు పూజలు నిర్వహించగా, మధ్యాహ్నం దళితులు భారీ పోలీసు బందోబస్తు నడుమ ఆలయంలో పూజలు చేసేందుకు బయల్దేరారు. వారు పయనించే మార్గం పట్టాభూమి కావడంతో వేరే మార్గంలో వెళ్లాలంటూ కొన్ని వర్గాలు షరతులు విధించాయి. దీంతో, ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఈ ఘటనను ఖండిస్తూ దళితులు రాస్తారోకో చేపట్టారు. దీంతో, అవాంఛనీయ సంఘటలను అడ్డుకొనేలా రెవెన్యూ శాఖ అధికారులు ఎట్టియమ్మన్ ఆలయానికి సీలు వేశారు.

కలెక్టర్ కార్యాలయంలో...

ఈ సమస్యకు సంబంధించి గత వారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇరువర్గాల ప్రతినిధులతో చర్చలు జరిగాయి. ఈ చర్చలు ఫలించడంతో, ఎట్టియమ్మన్ ఆలయానికి వేసిన సీలు నెల రోజుల అనంతరం రెవెన్యూ అధికారులు తొలగించి తలుపులు తెరిచారు. దీంతో, 200 మంది దళితులను జిల్లా కలెక్టర్ ప్రభుశంకర్, ఎస్పీ శ్రీనివాసపెరుమాళ్ నేతృత్వంలో ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం ఎట్టియమ్మన్ అమ్మవారికి ప్రత్యే అభిషేకాలు, అలంకరణ, దీపారాధన చేశారు. ఈ విషయమై కలెక్టర్ ప్రభుశంకర్ మాట్లాడుతూ... ఇరువర్గాల మధ్య ఏర్పడిన విభేధాల కారణంగా ఆలయానికి నెలరోజుల క్రితం సీలువేయగా, ఇరువర్గాల ప్రతినిధులను పిలిపించి, గ్రామంలో అన్ని వర్గాలు ఐకమత్యంగా ఉండాలని సూచించామని, అందుకు వారు అంగీకారం తెలుపడంతో ఆలయానికి వేసిన సీలు తొలగించామన్నారు. మళ్లీ సమస్యలు రాకుండా గ్రామంలో పోలీసు పికిటింగ్ ఏర్పాటుచేయడంతో పాటు ఆలయానికి వెళ్లే రోడ్డు, ఆలయంలో మండపం, మౌలిక వసతుల కల్పనకు రూ.76 కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు.

ఎంసీసీ స్కూలులో వాటర్ రీసైక్లింగ్ ప్లాంట్



వాటర్ రీసైక్లింగ్ ప్లాంట్ ప్రారంభిస్తున్న మంత్రి శివ వి. మెయ్యనాధన్

చెన్నై, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఓజోన్ దినం సందర్భంగా మద్రాసు క్రిష్టియన్ కాలేజీ హయ్యర్ సెకండరీ స్కూలులో వ్యర్థజలాల పునర్వినియోగ ప్లాంట్ ప్రవేశపెట్టారు. ఈ ప్లాంట్‌ను రాష్ట్ర మంత్రి శివ వి. మెయ్యనాధన్ సోమవారం ఉదయం ప్రారంభించారు హంబెర్ట్ ఎన్విరో కేర్ సిస్టమ్స్ (హెచ్‌ఈసీఎస్) సహకారంతో ఈ వేస్ట్‌వాటర్ రీసైక్లింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసినట్లు ఎంసీసీ స్కూలు కరస్పాండెంట్ డాక్టర్ జీజే మనోహరన్, ప్రిన్సిపాల్ జెబదాస్ దినకరన్ తెలిపారు. హెచ్‌ఈసీఎస్ సీఈఓ డాక్టర్ జేరా మోసెస్ తదితరులు పాల్గొన్నారు.

డీఎంకే కూటమి నుంచి వైదొలిగే ప్రసక్తే లేదు

● ఎండీఎంకే నేత వైగో

పెరంబూర్, సెప్టెంబరు 16: డీఎంకే కూటమి నుంచి వైదొలిగే ప్రసక్తే లేదని ఎండీఎంకే నేత స్పష్టం చేశారు. డీఎంఎస్ ప్రాంతంలోని కామరాజర్ ఆడిటోరియంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న వైగో మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపీ రహిత పార్టీలను విచ్ఛిన్నం చేసే చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. తాము ప్రాతినిధ్యం లేని రాష్ట్రాల్లో ఎలాగైనా కాలు మోపాలని బీజేపీ అనేక వ్యూహాలు రూపొందిస్తోందన్నారు. కానీ, బీజేపీ ఆటలు తమిళనాడులో సాగబోవన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజా పాలన అందిస్తోందన్నారు. ద్రావిడ సిద్ధాంతాలు ముందుకు తీసుకెళ్లేలా అందరూ ఐక్యంగా శ్రమించాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో ఎలాంటి ఎన్నికలొచ్చినా డీఎంకే కూటమి విజయం తథ్యమని, అందరూ అన్ని కూటమి పార్టీలు సమిష్టిగా కృషిచేయాలని వైగో కోరారు.

సచివాలయంలో సామాజిక న్యాయంపై ప్రతిజ్ఞ



చెన్నై, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ద్రవిడ ఉద్యమనేత పెరియార్ జయంతి సందర్భంగా సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్ మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో సామాజిక న్యాయ ప్రతిజ్ఞ చేయించారు. పెరియార్ జయంతి రోజైన సెప్టెంబర్ 17వ తేదీ సామాజిక న్యాయ దినంగా పాటించాలని ప్రభుత్వం ఇదివరకే ఉత్తర్వులిచ్చింది. ఆ మేరకు మంగళవారం సెలవు కావటంతో ముందుగా సోమవారం ఉదయం స్టాలిన్ మంత్రులు, అధికారుల చేత ఈ ప్రతిజ్ఞ చేయించారు. అన్ని ప్రాణుల పట్ల ప్రేమగా ఉంటామని, ఆత్మగౌరవంతో ప్రవర్తిస్తామని, సమానత్వం, సమధర్మం కోసం పాటుపడతామని, మానవత్వానికి అనుగుణంగా నడచుకుంటామని, సామాజిక న్యాయాన్ని నెలకొల్పేందుకు పోరాడుతామని స్టాలిన్ అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ముందుగా పెరియార్ చిత్రపటం వద్ద స్టాలిన్ పుష్పాంజలి ఘటించారు.



12 ఏళ్లకు ఒకసారి వికసించే 'కురింజి'

● సరికొత్త అందాలతో నీలగిరి

పెరంబూర్, సెప్టెంబరు 16: ఊటీ సమీపం ఎప్పనాడు కొండ ప్రాంతాల్లో, 12 ఏళ్లకు ఒకసారి పూసే 'కురింజి' పూలు వికసించడం ప్రారంభించాయి. ఈ ప్రాంతంలోని కొండపై సంతరించుకున్న పూల అందాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కురింజి పూలమొక్కలకు పలు ప్రత్యేకతలున్నాయి. నీలం కురింజి పూలమొక్కలు కొండ ప్రాంతాల్లో మాత్రమే పెరుగుతుంటాయి. మొక్క ఎత్తు 30 నుంచి 60 సెం.మీ వరకు ఉంటుంది. మూడేళ్లకు ఒకసారి పూసే మొక్కల నుంచి, 12 ఏళ్లకు ఒకసారి వికసించేవి అని పలురకాల కురింజి మొక్కలున్నాయి. 'స్ట్రొఫైల్లాన్థస్ కుంతియానస్' అనే శాస్త్రీయ నామం కలిగిన కురింజి పూలు 12 ఏళ్ల అనంతరం ఊటీ సమీపం ఎప్పనాడు, బిక్కనాడు కొండ అంచుల్లో వికసిస్తున్న పూలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.



తాంబరంలోని జగద్గురు బదారి శంకారాచార్య సంస్థానంలో చాతుర్మాస దీక్ష చేస్తున్న శకటాపురం శ్రీవిద్యా పీఠాధిపతి కృష్ణానంద తీర్థ మహాస్వామిని సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్న గవర్నర్ ఆర్‌ఎన్ రవి